ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.6, కనిష్ఠం 26.2

5 కామారెడ్డి జిల్లా వార్తలు

మంగళవారం 14 మే 2024


ఓటు వేసి సిరా చుక్కను చూపుతున్న యువతులు


ఓటు హక్కును వినియోగించుకుని వస్తున్న మహిళలు



పోటెత్తిన ఓటర్లు

• రాష్ట్రంలో జహీరాబాద్ పార్లమెంట్‌లోనే అత్యధిక ఓటింగ్ శాతం నమోదు

» జహీరాబాద్ పార్లమెంటు సెగ్మెంట్‌లో 71.91 శాతం పోలింగ్ » అత్యధికంగా ఎల్లారెడ్డిలో 74.74 శాతం పోలింగ్

» అత్యల్పంగా కామారెడ్డిలో 67.79 శాతం నమోదు » 2019 ఎన్నికల్లో 67.80 పోలింగ్ శాతం నమోదు

» గత ఎన్నికలతో పోలిస్తే 5 శాతం పెరిగిన పోలింగ్ » ప్రశాంతంగా పోలింగ్

» పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు » ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్ » ఒంటి గంట వరకు పోలింగ్ కేంద్రాలకు ఓటర్ల బారులు

» మధ్యాహ్నం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్


• పెద్దకొడప్‌గల్‌లో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రం లోపలికి తీసుకెళ్తున్న సిబ్బంది

కామారెడ్డి, మే13 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి కామారెడ్డి జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈసారి జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. రాష్ట్రంలోనే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధికంగా ఓటుశాతం నమోదు కావడం విశేషం. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. మధ్యాహ్నం 1గంటల వరకు పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిటకిటలాడాయి. ఆతర్వాత మందకొడిగా పోలింగ్ సాగుతూ వచ్చింది. కొద్దిమేర ఎండల ప్రభావంతో మధ్యాహ్నం వేలలో ఓటర్లు లేక పోలింగ్ కేంద్రాలన్ని వెలవెలబోయాయి. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 71.91శాతం పోలింగ్ నమోదు అయింది. అయితే ఈసారి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గంటపాటు పోలింగ్ సమయాన్ని పెంచారు. 6గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగడంతో సాయంత్రం 5నుంచి ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. గడువు ముగిసినప్పటికి కేంద్రం లోపల ఉన్న వారికి ఓటువేసేందుకు అనుమతి ఇచ్చారు. అత్యధికంగా ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో 74.74 శాతం, అత్యల్పంగా కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో 67.79 శాతం పోలింగ్ నమోదు అయింది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. మరికొన్ని చోట్ల కొన్ని ఓట్లు గల్లంతవడంతో వారు ఓటు వేయకుండా నిరాశతో వెనుదిరిగారు.

జహీరాబాద్ సెగ్మెంట్‌లో 71.91 శాతం

కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సోమవారం పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎంపీ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రశాంతంగా జరుగుతూ వచ్చింది. ఈ ఎంపీ సెగ్మెంట్‌లో సాయంత్రం 5గంటల వరకు 71.91శాతం పోలింగ్ నమోదైంది. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో 71.41 శాతం, ఎల్లారెడ్డిలో 74.74 శాతం, బాన్సువాడలో 73.09 శాతం, జుక్కల్‌లో 75.83 శాతం, జహీరాబాద్‌లో 70.54 శాతం, నారాయణఖేడ్‌లో 70.83 శాతం, ఆందోల్‌లో 73.69 శాతం పోలింగ్ నమోదయ్యాయి. గత 2019 ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో 67.80 పోలింగ్‌శాతం నమోదైంది. గతంతో పోలిస్తే 5 శాతం ఎక్కువగానే పోలింగ్ నమోదైంది. వేసవి కాలం కావడంతో కేంద్రాల వద్దకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసింది. టెంట్లు వేయడం, మంచి నీటి సౌకర్యంతో పాటు వైద్య సదుపాయలను కూడా సమకూర్చారు.

జిల్లా పరిధిలోనే అధిక పోలింగ్ శాతం

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని సంగారెడ్డి జిల్లాతో పోలిస్తే కామారెడ్డి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే ఎక్కువగా పోలింగ్‌శాతం నమోదు కావడం విశేషం. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ సరళి ఇలా సాగింది. ఉదయం 9 గంటలకు 12.88శాతం పోలింగ్ నమోదు కాగా, 11 గంటల వరకు 31.83 పోలింగ్ శాతం నమోదైంది. మధ్యాహ్నం 1గంటలకు 50.71 పోలింగ్‌శాతం నమోదు కాగా, 3గంటలకు 63.96శాతం నమోదైంది. ఇలా జహీరాబాద్ పార్లమెంటు పరిదిలో 5గంటల వరకు ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 71.91 పోలింగ్ నమోదైంది.

మొరాయించిన ఈవీఎంలు

జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా కామారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం 7గంటలకే ప్రారంభం కావాల్సి ఉండగా ఈవీఎంల మొరాయింపుతో 1గంట ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ సాగింది. దోమకొండ మండలంలోని చింతమాన్‌పల్లిలో గల పోలింగ్ కేంద్రంలో అరగంట పోలింగ్ నిలిచిపోయింది. బాన్సువాడ బాలికల ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో 20 నిమిషాల పాటు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మద్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం బూత్ నంబర్ 22లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాన్సువాడ పట్టణంలోని 240 బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో పదినిమిషాలు ఓటింగ్ ఆగింది.


• దోమకొండలో వృద్ధుడిని పోలింగ్ కేంద్రం లోపలికి తీసుకెళ్తున్న సిబ్బంది

బారులు తీరిన మహిళలు, యువత

జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో మహిళల, యువత ఓట్లే అధికంగా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో జరిగిన లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలకు మహిళలు, యువత బారులు తీరారు. వీరే అధికంగా ఓట్లువేసేందుకు ఆసక్తిచూపారు. జహీరాబాద్‌పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతీ పోలింగ్ కేంద్రాల్లో మహిళల క్యూ లైనే ఎక్కువగా ఉన్నట్లు కనిపించాయి. మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరిలారు. వీరితో పాటు యువతి, యువకులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి చూపారు. ప్రతీ పోలింగ్ కేంద్రాల్లోను యువతీ, యువకుల సందడి నెలకొంది. కొత్తగా ఓటుహక్కు వచ్చిన వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపారు. పలు పోలింగ్ కేంద్రాల్లో భారీగా క్యూ లైన్ ఉన్నప్పటికీ మహిళలు, యువతీ యువకులు క్యూలోనే ఉండి ఓట్లు వేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కామారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తూ ఏర్పాటు చేయడం, పోలింగ్ కేంద్రాల నుంచి 100ల మీటర్ల వరకు ఓటర్లను మినయిస్తే ఇతరులను అనుమతించకపోవడంతో పోలింగ్ ప్రక్రియ సాఫీగా సాగుతూ వచ్చింది. జిల్లాలో ఏ ఒక్క పోలింగ్ కేంద్రం వద్ద కూడా ఆందోళనలు కాని, నిరసనలు కాని జరగకపోవడం విశేషం. మరో వైపు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ సింధుశర్మలతో పాటు జిల్లా స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ పలు సలహాలు సూచనలు వచ్చారు. అదే విధంగా బరిలో ఉన్న అభ్యర్థులు బీబీ పాటిల్, సురేష్ షెట్కార్‌లతో పాటు ఆయా పార్టీలకు చెందిన నాయకులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వారి వారి కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేస్తూ రావడంతో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకుండా ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, జిల్లాయంత్రాంగం ఊపిరి పిల్చుకున్నారు.


ఓటు వేసేందుకు బారులుతీరిన ఓటర్లు


ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే


జిల్లాకేంద్రంలో ఓటు వేసేందుకు బారులుతీరిన ఓటర్లు


పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు తీసుకెళ్తున్న అధికారులు



సెల్ఫీ తీసుకుంటున్న కలెక్టర్


ఓటేసి వస్తున్న ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ


.. జిల్లా ఎస్పీ సింధూ శర్మ


.. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి


.. బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్


ఓటు వేసి వస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన ట్రాన్స్‌జెండర్లు


మద్నూర్‌లో వృద్ధురాలిని సైకిల్‌పై తీసుకెళ్తూ..



వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్


ఓటు వేసి వస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ రాజు

పలువురి ఓట్ల గల్లంతు!



చనిపోయిన వ్యక్తికి వచ్చిన ఓటరు స్లిప్

బతుకున్న వ్యక్తి ఓటును తొలగించిన అధికారులు

సదాశివనగర్, మే 13: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అధికారులు చేసిన హడావుడి అంతాఇంతా కాదు. చివరకు బతుకున్న వారి ఓట్లను తొలగించి చనిపోయిన వారి ఓట్లను అలాగే ఉంచారు. దీంతో తమ ఓటు గల్లంతైందని ప్రజలు తమ ఓటుహక్కు వినియోగించుకోలేకపోయారు. పద్మాజీవాడిలో మూడేళ్ల కింద చనిపోయిన ఓటరును జాబితా నుంచి తొలగించాలని దరఖాస్తు చేసుకున్నప్పటికీ తొలగించకపోగా అదే కుటుంబంలోని బతుకున్న వ్యక్తి ఓటును తొలగించారు. ఓటుహక్కు వినియోగించుకోమని చెబుతున్న అధికారులు బతికున్నవారి ఓట్లు గల్లంతుచేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మండలంలో పోలింగ్ సరళిని పరిశీలించారు.


ఓటు వేసేందుకు వచ్చి చెట్టు కింద సేద తీరుతున్న ఓటర్లు

ఈవీఎంలతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లకు చేరుకున్న బస్సులు



విజయమేరి పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న బస్సులు

బోధన్ రూరల్, మే 13: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బోధన్ పట్టణంలోని విజయమేరి పాఠశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులతో ఈవీఎంలు ఆదివారం సాయంత్రం చేరుకున్నాయి. ఎన్నికల సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాలకు అధికారులతో సహ తరలివెళ్లాయి. సోమవారం సాయంత్రం గ్రామాలలో ఎన్నికలు ముగిసిన అనంతరం తిరిగి బోధన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకున్నాయి. 246పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు విజయమేరి పాఠశాలలో భద్రపర్చగా ఎన్నికల నేపథ్యంలో ఆయా సెంటర్‌లకు బస్సులలో ఈవీఎంలను తరలించారు. సోమవారం సాయంత్రం ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఈవీఎం బస్సులు విజయమేరి పాఠశాలకు చేరుకున్నాయి. అనంతరం ఈవీఎం బస్సులను పోలీసులు భారీ బలగాలతో డిచ్‌పల్లిలోని సీఎస్ఐ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చు కేంద్రానికి తీసుకువెళ్లనున్నారు. సుమారు 50నుండి 60బస్సుల వరకు ఈవీఎంలలో తరలివెళ్తాయని ఎన్నికల అధికారులు తెలిపారు.

ప్రియం.. ప్రియం.. నాటుకోడి!

● కొవ్వు నిల్.. పోషకాలు ఫుల్ ● గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన కోళ్ల పెంపకం ● లైవ్ కిలో రూ.550
● కొనేందుకు ఆసక్తి చూపుతున్న మాంసం ప్రియులు ● కుటీర పరిశ్రమగా మలుచుకుంటున్న గ్రామీణులు
● నిజామాబాద్ జిల్లాలో ప్రతీరోజు వేలల్లో నాటుకోడి విక్రయాలు

నందిపేట, మే 13: నాటుకోడి మాంసానికి రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. కొవ్వు శాతం తక్కువగా ఉండడం, పోషకాలు అధికంగా ఉండడంతో నాటుకోడి మాంసం తినేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. బ్రాయిలర్ కోడి, మటన్‌లతో పోలిస్తే నాటుకోడే ఆరోగ్యానికి మేలని వైద్యులు పేర్కొనడమే ందుకు కారణం. కోడి ధర ఘాటెక్కినా రుచి మాత్రం భలే హాటు అంటూ మాంసాహారులు లొట్టలు వేసుకొని తింటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది నాటుకోళ్ళ పెంపకాన్ని కుటీర పరిశ్రమగా మార్చుకుంటున్నారు. జిల్లాలో ముఖ్యంగా ఆర్మూర్, బాల్కోండ, నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో ప్రతీ రోజు నాటుకోళ్ళ విక్రయాలు రూ.లక్షల్లో జరుగుతున్నాయి. నాటుకోళ్ల వ్యాపారం టాప్ లెవల్లో దూసుకుపోతోంది. నాటుకోడి మాంసం అంటే చాలు మాంసాహారులు లొట్టలు వేసుకుంటున్నారు. ఇవి సహజ సిద్దంగా పెరగడంతో వీటిని తినందుకు చాలామంది ఇష్టపడుతున్నారు. అంతే కాకండా నాటుకోడి బరువులు పెరగడానికి ఏలాంటి ఇంజక్షన్లు ఇవ్వక పోవడం, వీటికి ఆహారంగా బియ్యం, మొక్కజొన్న, జొన్న గింజలు వేయడంతోనే బరువు పెరుగుతున్నాయి. దింతో నాటుకోడి కూర, పులుసు అంటే మాంసాహారులు పడి చస్తున్నారు. మరోవైపు నాటు కోళ్లలో పోషకాలు అధికమని, కొవ్వు శాతం తక్కువ మోతాదులో ఉంటుందని వైద్యులు సూచిస్తుండడంతో ఇటీవల నాటుకోడికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. దింతో కోడి మాంసం ధర ఘాటెక్కినా రుచి మాత్రం భలే పసందు అంటున్నారు మాంసం ప్రియులు.

● సహజ సిద్ధమైన వాతావరణంలో..

నాటుకోళ్ల పెంపకం కోసం ఎలాంటి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. కేవలం మన ఇంటి ముందు కాస్త ఖళీ స్థలం ఉంటే చాలు. వాటికి ఎలాంటి దాణా కానీ, మందులు, ఇంజక్షలు ఇచ్చే అవసరం లేదు. సహజ సిద్దంగా లభించే గింజలు, చిన్న చిన్న క్రిములను ఆహారంగా తీసుకొని పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రతీ పల్లెటూరిలో సైతం మటన్, చికెన్ షాపులు వెలిశాయి. కోరుకున్న సమయంలో అనుకున్నంత మాంసం లభించడంతో నాటుకోళ్ళ పెంపకం కొద్దిగా తగ్గుముఖం పట్టింది. దింతో ధర అమాంతం పెరిగిపోయింది.

నాటుకోడి మాంసం విక్రయిస్తున్నాం

: ఏనుగుల పోశాగౌడ్, అర్డర్ మెస్ నిర్వాహకులు, నందిపేట



బ్రాయిలర్ చికెన్ కంటే నాటుకోడి కావాలని అడుగుతున్నారు. కస్టమర్ల డిమాండ్ మేరకు గ్రామాల్లో నుంచి కోళ్ళను కొనుక్కోస్తున్నాను. ఒక నాటు కోడి కిలో రైస్‌కు రూ.550 తీసుకుంటున్నా. రోజు నా ఆర్డర్ మెస్‌లోనే 10 కోళ్లకు పైగా విక్రయిస్తున్నా. నాటుకోడి లేకుంటే గిరాకీ వాపస్ పోతోంది. బ్రాయిలర్ తినమంటే అలవాటు లేదంటున్నారు.

● మాంసంలో కొవ్వు నిల్

నాటుకోడి మాంసంలో కొవ్వు శాతం పూర్తిగా తక్కువగా ఉండడం, పోషకాలు అధికంగా ఉండడంతో వైద్యులు నాటుకోడి మాంసం తినడం మంచిదని చెబుతున్నారు. బ్రాయిలర్ కోడి, మటన్‌లతో పోలిస్తే నాటుకోడి ఆరోగ్యానికి మేలని తెలుసుకున్న మాంసాహారులు నాటు మాంసంపై మక్కువ చూపుతున్నారు. రుచిలో కూడా నాటుకోడి కూర, పులుసు నోరూరిస్తోంది. ఈ మాంసం తినేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది.

● లైవ్ కిలో రూ.550 మాత్రమే..

గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోడి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏకంగా మటన్ ధరతో సమానంగా తూగుతోంది. మటన్ ధర కిలో రూ.600 నుంచి 700 పలుకుతోంది. నాటుకోడి ధర లైవ్ కిలో రూ.550కి చేరింది. ఈ లెక్కన డ్రెస్‌డు నాటుకోడి మాసం కిలోకు రూ. 650 వరకు పలుకుతోంది. రెస్టారెంట్, పర్మిట్ రూం, దాబా హోటళ్ళలో ఒక నాటుకోడి కూర, పులుసు ధర రూ.900 నుంచి రూ.1000 వరకు వెళ్తోంది.

● కుటీర పరిశ్రమగా మారుతున్న తీరు

నాటుకోడి మాంసానికి పెరుగుతున్న ఆధరణ చూసి మళ్ళీ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ఇళ్ళలో కోళ్ళను పెంచుటున్నారు. పట్టణ ప్రాంతాలలో సైతం కొంత మంది పెరటి కోళ్ళను పెంచుకుంటున్నారు. ఒక నాటుకోడి దాదాపు కిలో నుంచి కిలోన్నర బరువు పెరగాలంటే ఆరు నెలల సమయం పడుతోంది. మార్కెట్లో వీటికి ఉన్న డిమాండును చూసి పెద్దఎత్తున్న కోళ్ళ పెంపకాన్ని గ్రామీణులు చేపడతున్నారు. ఒక్కోక్క ఇంట్లో ఇరువై నుంచి ముప్పై కోళ్ళు పెంచుతున్నారు. వాటికి పిల్లలు పుట్టినా కొద్ది 750గ్రాములు, కిలో బరువున్న కోళ్ళను వ్యాపారులకు, హోటల్ వారికి విక్రయిస్తున్నారు. జిల్లాలో చికెన్ సెంటర్లలో నాటుకోడి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నందిపేట, ఆర్మూర్, బాల్కోండ, నవీపేట జరిగే వారాంతపు సంతలో నాటుకోళ్ళ విక్రయాలు భారీగా జరుగుతున్నాయి.

● పెరటి కోళ్ల పెంపకం

ఇటీవల కొందరు నిరుద్యోగులు పౌల్ట్రీ ఫారాలను అద్దెకు తీసుకొని పెరటి కోళ్ళను పెంచుతున్నారు. గ్రామాల్లో పెరుగుతున్న పెరటి కోళ్ళను సంతలలో విక్రయిస్తున్నారు. కొందరైతే నేరుగా దాబా హోటళ్ళకు సరఫరా చేస్తున్నారు. ఏదీ ఏమైనప్పటికి నిజామాబాద్ జిల్లాలో నాటుకోడి విక్రయాలు టాప్ లెవల్‌లో దూసుకుపోతున్నాయి.



నందిపేటలో అమ్మకానికి సిద్దంగా ఉన్న నాటుకోళ్లు



అర్డర్ మెస్‌లో నాటుకోళ్లను వండుతున్న దృశ్యం

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

నిజామాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ కుటుంబాలతో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి ఎంపీ అర్వింద్ నిజామాబాద్‌లోని కాకతీయ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సిరికొండ మండలం రావుట్లలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడు కెఆర్ సురేష్‌రెడ్డి కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో ఓటు వేశారు. బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తన స్వగ్రామం సిరాన్‌పల్లిలో ఓటు వేశారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి మిర్చికంపౌండ్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటును వినియోగించుకున్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గూపన్‌పల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అంకాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ గోల్‌హనుమాన్ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. అంతేకాకుండా జిల్లా సెషన్ జడ్జి కుంచాల సునీత బాలసదన్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నగర సీపీ కల్మేశ్వర్ సింగన్‌వార్ కూడా బాలసదన్‌లోనే ఓటు వేశారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు ధర్మారం(బి) గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త కుటుంబ సభ్యులతో కలిసి గంగాస్తాన్‌లో ఓటు వేయగా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అంకాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.



ఓటు హక్కును వినియోగించుకున్న నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్



ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



ఓటు వేసినట్లు చూపుతున్న కాంగ్రెస్ నేత మహేష్‌కుమార్‌గౌడ్



ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే బిగాల

ఓటు వేసేందుకు వచ్చి వృద్ధురాలు మృతి

కోటగిరి,మే13: పొతంగల్ మండల కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చి శ్రీగంధం గిర్మవ్వ(83)అనే వృద్దురాలు మృతి చెందింది. గిర్మవ్వ 21వ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వచ్చింది. పోలింగ్ కేంద్రం ఆవరణలో స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ విషయమై ఎస్ఐ సందీప్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.



● మృతురాలు గిర్మవ్వ

'బీఆర్ఎస్ ఓడిపోతామన్న భయం'



చందూరులో విలేకరులతో మాట్లాడుతున్న ఏనుగు రవీందర్ రెడ్డి

వర్ని,మే13: ఓడిపోతున్నామన్న భావనతో బీఆర్ఎస్ పార్టీ వారు బీజేపీ పార్టీ వారి మద్దతు కోరడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. చందూర్ మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు కాంగ్రెస్ నాయకత్వాన్నే బాన్సువాడలో కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. 2004లో మధుయాష్కి, బాజిరెడ్డి గోవర్ధన్‌లకు అవకాశం కల్పించిన తరహాలో 20ఏళ్ల అనంతరం కాంగ్రెస్‌కే ఎంపీ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీల అమలు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆగస్టు 15లోపు రైతుల రుణమాఫీ చేయడం తథ్యమని భరోసా ఇచ్చారు. సమావేశంలో నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, కల్లూరి రామిరెడ్డి, అశోక్ రెడ్డి, భూమిరెడ్డి, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

పోలింగ్ సరళి పరిశీలన



నవీపేటలో మాట్లాడుతున్న బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి

నవీపేట,మే13: మండలంలోని వివిధ గ్రామాలలో జరిగిన పోలింగ్ సరళిని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● బీజేపీ నాయకుల పరిశీలన

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి సోమవారం మండలంలోని వివిధ గ్రామాలలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థి గెలుపు గురించి కార్యకర్తల నుంచి వివరాలను వాకబు చేశారు. అంతకు ముందు ఆయన తన స్వగ్రామమైన మోకన్‌పల్లిలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించున్న సునీల్‌కుమార్



సావెల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సునీల్‌కుమార్

మెండోర, మే13: బాల్కొండ మండలం సావెల్ గ్రామంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును ప్రతీఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు.

ఓటు వేసిన కాసుల బాలరాజు



ఓటు వేసిన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడటౌన్, మే 13: రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఓటు వేశారు.


నవీపేట మండలంలో 68.84శాతం పోలింగ్



నవీపేట పోలింగ్ కేంద్రంలో గేటు మూసివేస్తున్న పోలీసులు

నవీపేట,మే13: సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా నవీపేట మండలంలో 68.84శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 54 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండలంలో 46,192మంది ఓటర్లు ఉండగా వీరిలో 21,499మంది పురుషులు, 24,693మంది స్త్రీలు ఉన్నారు. ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. సాయంత్రం 6గంటలకు పోలింగ్ కేంద్రాల గేట్లను పోలీసులు మూసివేశారు. నవీపేట జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో కొనసాగిన పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 6గంటలకు సీఐ శ్రీనివాస్ రావు, ఎస్ఐ యాదగిరి గౌడ్, ఏఎస్ఐ మోహన్ రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది ఓటింగ్ సమయం ముగిసిన తర్వాత ప్రధాన గేటును మూసివేశారు. సాయంత్రం 6గంటల తర్వాత ఒకరిద్దరు ఓటర్లు ఓటు వేయడానికి వచ్చినప్పటికీ సమయం దాటిపోవడంతో పోలీసులు వారికి వెనక్కి పంపించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల భారీ బందోబస్తు



బోధన్‌లో పోలీసుల భారీ బందోబస్తు దృశ్యం

బోధన్‌రూరల్,మే13: సోమవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. 144సెక్షన్ ఉండడంతో ప్రజలను గుమిగూడనివ్వకుండా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగనివ్వకుండా పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు.

గుండారంలో స్వల్ప ఉద్రిక్తత



గుండారంలో స్వల్ప ఉద్రిక్తత

నిజామాబాద్ రూరల్, మే, 13: నిజామాబాద్ జిల్లా రూరల్ మండలం గుండారంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. గుండారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల సమీపంలో గుంపులుగా ఉన్న జనాన్ని చూసి ట్రైనీ ఐపీఎస్ అధికారి చైతన్యరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించినా స్పందించక పోవడంతో ఆగ్రహంతో ఊగిపోయారు. గుంపులను చెదరగొట్టారు. బీజేపీ నేత గుండారం ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి వాదనకు దిగారు. పోలీసు జీప్ ఎక్కమని ఆదేశించడంతో తాను ఓటువేసి పోలీసు స్టేషన్ వస్తానని వాగ్వాదానికి దిగారు. ఓటు వేసిన అనంతరం రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి సరెండర్ అయ్యారు. దాంతో బీజేపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్‌కు ఫిర్యాదుచేశారు. దాంతో ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో మాట్లాడిన తర్వాత శంకర్ రెడ్డిని వదిలిపెట్టారు. ఆకుల కొండూరు గ్రామంలో యువకులతో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా మాజీ సర్పంచ్ అశోక్‌తో వాగ్వాదానికి దిగారు. మల్కాపూర్ (ఏ)లో సైతం ఇలాంటి ఘటనలు జరిగాయి.

గుట్టు చప్పుడు కాకుండా మొరం అక్రమ రవాణా



బాల్కొండలో అక్రమంగా మొరం తరలిస్తున్న దృశ్యం

ముప్కాల్, మే13: బాల్కొండ మండలంలో మొరం అక్రమ రవాణా గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతుంది. సెలవు దినాలతో పాటు ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల నిర్వహణలో నిమగ్నమై ఉన్నారని అలుసుగా తీసుకొని మొరం వ్యాపారస్తులు రాత్రి, పగలు తేడా లేకుండా బాల్కొండ మండల కేంద్రం నుంచి అందినంత దోచుకుంటున్నారు. పనిదినాల్లో అయితే ప్రభుత్వానికి చలాన్ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, మొరం వ్యాపారులు ఎన్నికలను అసరగా చేసుకొని మొరం గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నరు. గత రెండు, మూడు రోజుల నుంచి మొరం తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదు. మొరం అక్రమ రవాణాపై, తహసీల్దార్ అధికారులను, ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా మేము ఏటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.ఎలక్షన్ నిర్వహణలో ఉన్నామని పేర్కొనడం గమనార్హం. అక్రమ మొరం తరలింపులో అధికారుల ప్రమేయం ఉందన్న అనుమానాలు రెకెత్తుతున్నాయి. మొరం తరలిస్తూ మొరం వ్యాపారులు మాత్రం తమకు ఏటువంటి నిబంధనలు పట్టనట్టుగా మూడు ట్రాక్టర్‌లు, ఆరు టిప్పర్‌లుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొరం అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరారు..

తమ సమస్యలు పరిష్కరించేంతవరకు ఓటు వేసేది లేదని ఆందోళన



ఓటు వేయబోమని కూర్చున్న రాంసాగర్ తాండా వాసులు

ఇందల్వాయి, మే 13: పార్లమెంట్ ఎన్నికలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 7గంటలకే మొదలవగా సిర్నాపల్లి గ్రామంలో గల రాంసాగర్ తాండా వాసులు తమ సమస్యలు పరిష్కరించేంతవరకు ఓట్లు వేయమని బీష్మించుకొని కూర్చున్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు తమకు స్పష్టమైన హామీ ఇస్తేనే తామంతా ఓటు హక్కు వినియోగించుకుంటామని ఓ చెట్టుకింద సమావేశమయ్యా రు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిర్నాపల్లి గ్రామ పరిధిలోని రాంసాగర్ తాండాలో ఓ ప్రత్యేక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో తమ ప్రధాన సమస్యలైన రోడ్డు, వీధిదీపాలు, డ్రైనేజీలు, పక్కా ఇండ్లు వీటిలో ఏవీ కూడా నెరవేర్చడం లేదని ఈసారి తాండాలోని ఎవరూ కూడా ఓటు వేయమంటూ తాండావాసులు ఒకచోట సమావేశమై కూర్చున్నారు. సుమారు రెండు గంటల వరకు పోలింగ్ బూత్‌కు ఒక్క ఓటరు కూడా రాకపోవడంతో ఎన్నికల అధికారులు వేచి చూసి చేసేదేమి లేక పోలింగ్ స్టేషన్ నుంచి బయటకు వచ్చి బయట కూర్చున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి రాంసాగర్ తండాకు వెళ్లి తాండావాసులతో చర్చలు జరిపి ఎన్నికలు పూర్తయిన వెంటనే తాండాకు రోడ్డు, వీధి దీపాలను వేయిస్తానని హామీ ఇవ్వడంతో రెండుగంటల 40 నిమిషాల తర్వా త ఓట్లు వేసేందుకు తండా వాసులు పోలింగ్ కేంద్రానికి వచ్చారు. ఈ పోలింగ్ బూత్‌లో మొత్తం 110 ఓట్లు ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఈ సారి తమ సమస్యలను తీర్చకుంటే రానున్న ఎన్నికల్లో ఏ నాయకుడిని కూడా తాండాకు రానిచ్చేది లేదని తమ ఓటు హక్కు వినియోగించుకోమని తెలిపారు.

కమ్మర్‌పల్లిలో ఓటింగ్ సరళి పరిశీలన



ఉప్లూర్‌లో ఓటింగ్ సరళిని అడుగి తెలుసుకుంటున్న బాల్కొండ ఎమ్మెల్యే

కమ్మర్‌పల్లి, మే 13: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కమ్మర్‌పల్లి మండంలోని పలుగ్రామాలలో సోమవారం పర్యటిస్తూఓటింగ్ సరళిని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని పలుగ్రామాల్లో కార్యకర్తలద్వారా ప్రతీ రెండు గంటలకు సంబంధించిన పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలకేంద్రలోని పార్టీ కార్యాలయంలో కూర్చొని మండల నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. మండల ఎంపీపీ లోలపు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, రైతులనాయకులు బద్దం రాజేశ్వర్, బద్దం చిన్నారెడ్డి, బద్రి, కోరె నర్సయ్య, సుమన్, హల్దె శ్రీనివాస్, ఏనెడ్ల రవిందర్, అవారి మురళి, మహిళ కార్యక్తలు ఉన్నారు.

● పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే పోచారం

కోటగిరి, మే 13: కోటగిరి ఉమ్మడి మండలంలో జహీరాబాద్ పార్లమెంట్ పోలింగ్ సరళిని సోమవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. కోటగిరి, జల్లాపల్లి ఫారం, ఆబాదీ, పొతంగల్ మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గుండెపోటుతో వీఆర్ఏ మృతి



మృతుడు మహమ్మద్ సాధక్

ధర్పల్లి, మే 13: మండలానికి చెందిన మహమ్మద్ సాధక్ (31) వీఆర్ఏ గుండెపోటుతో మృతి చెందాడు. తహశీల్దార్ కార్యాలయంలో ఒన్నాజిపేట్ వీఆర్ఏగా పనిచేస్తున్న సాధక్ వారం రోజుల నుంచి ఎన్నికల విధినిర్వహణలో భాగంగా డిచ్‌పల్లి సీఎంసీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం రాత్రి సాధక్ ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో అతన్ని మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. సాధక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. సాధక్ మృతి పట్ల తహశీల్దార్ మాలతి, ఆర్ఐ రవి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. సాధక్ మృతి చెందిన విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు తహశీల్దార్ మాలతి ఫోన్‌లో వివరించారు. తక్షణ సహాయం కింద తహశీల్దార్ రూ.20వేలు, ఆర్ఐ రూ.5వేలు అందజేశారు. అందరితో కలుపుగోలుపుగా ఉండే సాధక్ మృతి చెందడంపై రెవెన్యూ సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఓటు హక్కును వినియోగించుకున్న సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డి, మే 13 : పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆదర్శ ఓటింగ్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కుటుంబ సమేతంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనతో పాటు ఆయన సతీమణి, కుమారుడు, కోడలు ఉన్నారు.



ఓటు హక్కును వినియోగించుకున్న సుభాష్‌రెడ్డి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



బైరాపూర్‌లో బారులు తీరిన మహిళా ఓటర్లు



మద్నూర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు



ఎల్లారెడ్డిలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

వర్ని:వర్ని, చందూర్ మండలాల పరిధిలో సోమవారం జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తగిలేపల్లి గ్రామంలో ఈవీఎం యంత్రం సుమారు 50నిమిషాల పాటు మొరాయించింది. దీంతో ఓటర్లు ఓటు కోసం ఎదురు చూశారు. అధికారులు యంత్రాన్ని పోలింగ్ అధికారుల సహకారంతో సరి చేశారు. ఎస్ఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.

మోస్రా: మండలంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 10,322ఓట్లు ఉండగా 8,147మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 78.9శాతం పోలింగ్ నమోదైంది.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో సోమవారం జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కోటగిరి మండలంలోని బస్వాపూర్, కొత్తపల్లి గ్రామాలలో ఈవీఎంలు పది నిమిషాల పాటు మొరాయించడంతో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉమ్మడి మండలంలో 53పోలింగ్ కేంద్రాలు ఉండగా 40,126మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు ఓటర్లకు వసతులు కల్పించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని కోటగిరి, పొతంగల్, ఎత్తొండలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

రుద్రూరు: పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం రుద్రూరు మండల కేంద్రంతో పాటు గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉదయం ఎండ తీవ్రత తక్కువగా ఉంటుందని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ ప్రారంభమైన కొద్ది సమయంలోనే అధిక సంఖ్యలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి బారులు తీరారు. అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పకడ్బందీగా సౌకర్యాలు కల్పించారు. ఎన్నికల్లో యువత, మహిళలు, వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండలంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచి గ్రామాల్లో ఓటర్లు అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మోర్తాడ్‌లో అన్ని పోలింగ్‌స్టేషన్‌లకు దూరంలోనే వాహనాలకు ప్రవేశ లేక కేవలం కాలినడక వెళ్ళి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీ సంబంధించిన కండువలు, టెంట్లు ఏర్పాటు చేసుకోవడాన్ని అనుమతించలేదు. 4గంటల వరకు పార్టీల నాయకులు రోడ్లపై ఓటర్లను ప్రచారం చేశారు. అనంతరం పోలీసులు రోడ్లపై ఉండకూడదని చాటింపు వేశారు. ఏది ఏమైన మండలంలో ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నందిపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎండ తీవ్రతకు ఓటర్లు ఉదయం నుంచే బారులు తీరారు. సోమవారం వారాంతపు సంత ఉండడంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. నందిపేట మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ సరళిని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పరిశీలించారు. ఈవీఎంలతో పోలింగ్ జరగడంతో కరెంటుకు అంతరాయం కలుగకుండా నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈఎం.అశోక్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు.

పిట్లం: మండలంలో సోమవారం జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినాయని ఎన్నికల అధికారి కిషన్ తెలిపారు.ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించారు.జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పిట్లంలోని 209 పోలింగ్ కేంద్రంలో ఓటు వేసినారు.

ఎల్లారెడ్డి: పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉదయం ఎండ తీవ్రత తక్కువగా ఉంటుందని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ ప్రారంభమైన కొద్ది సమయంలోనే అధిక సంఖ్యలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి బారులు తీరారు. అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పకడ్బందీగా సౌకర్యాలు కల్పించారు. ఎన్నికల్లో యువత, మహిళలు, వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపారు.

పెద్దకొడప్‌గల్: పెద్ద కొడప్‌గల్ మండలంలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని ఆయా గ్రామాలలో పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు.పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో గల పోలింగ్ కేం ద్రాన్ని బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సందర్శించారు. డోంగ్లీ మండలం సిర్పూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న బీబీ పాటిల్ జహీరాబాద్ వెళ్తున్న క్రమంలో పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో ఆగిపోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పోలింగ్ కేంద్రంలోకి చేరుకుని పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులతో మాట్లాడి ఎన్నికలు ఎలా సాగుతున్నాయన్న విషయం తెలుసుకున్నారు. అక్కడి నుంచి పో లింగ్ కేంద్రం బయటకు వచ్చి యువకులతో సెల్ఫీలు దిగారు. ఈ కార్య క్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం పాల్గొన్నారు.

మద్నూర్: జహీరాబాద్ పార్లమెంట్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.కుటుంబ సభ్యులతో పాటు మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట:నాగిరెడ్డిపేట మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 78 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉదయం 7 గంటల నుంచి బారులు తీరారు. మండల కేంద్రంలోని గోపా ల్‌పేట్ పోలింగ్ కేంద్రాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. మండలంలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగలేవు. మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

మద్నూర్: జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని జుక్కల్ నియో జకవర్గంలోని మద్నూర్, డోంగ్లీ ఉమ్మడి మండలాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 22 పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో 8.30 గంటల తర్వాత పోలింగ్ ప్రారంభమైంది. ఓటర్లు ఉదయమే వచ్చి ఈవీఎంలు మొరాయించడంతో తిరిగి వెళ్లిపోయాయి.

బాన్సువాడ / బాన్సువాడటౌన్: బాన్సువాడ నియోజకవర్గంలో సోమవారం పార్లమెంట్ 4 వ విడత ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 258 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 26 సెక్టార్లలో 48 సమస్యాత్మక ప్రాంతాలలో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు. పట్టణంలోని 240 పోలింగ్ బూత్ వీవీప్యాడ్ సమస్యతో పోలింగ్ 10 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. వేసవికాలం కావడంతో ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్): నిజాంసాగర్, మహ్మద్‌నగర్ ఉమ్మడి మండలాల్లో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ రాజు, ఉమ్మడి జిల్లాల మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. మహ్మద్‌నగర్ మండలంలోని పిప్పిరా గడి తండాలో ఓటర్లు తాండాలోమౌళిక సదుపాయాలు కల్పించే వరకు ఓటు వేయ్యమని బీష్మించుకుని కూర్చోవడంతో తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, ఎస్సై సుధాకర్‌లు హూటా హూటీన తాండాకు చేరుకున్నారు.తక్షణమే తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో తాండావాసులు శాంతించారు.

బీర్కూర్: బీర్కూర్ మండలంలో పోలింగ్ శాతం గంట గంటకు పెరుగుతూ వచ్చింది. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ఓటు వేసేందుకు ఆసక్తి చూపారు. కొన్ని గ్రామాల్లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైనా మధ్యాహ్నం వరకు తిరిగి పోలింగ్ శాతం పుంజుకుంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిలు బీర్కూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించాలి

కామారెడ్డిటౌన్, మే 13: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిచిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించాలని డిప్యూటి తహసీల్దార్‌లను అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆదేశించారు. వరికుప్పల రక్షణ కోసం జిల్లా పౌరసరఫరా, సహకార శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వరికుప్పలు పడి ఉన్నందున లారీలను తప్పనిసరిగా దించుకోవాలని రైస్‌మిల్లుల యాజమానులకు సూచించారు.సీఎంఆర్ డెలివరిలను వేగవంతం చేయాలని రైస్‌మిల్లర్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరాఫరాల మేనేజర్ నిత్యానందం, సివిల్‌సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు సీజ్

లింగంపేట, మే13: లింగంపేట మండలంలోని ముంబాజీపేట, పొల్కంపేట గ్రామాలలో ఆదివారం రాత్రి ఓటర్లకు పంచుతున్న బద్యం సీజ్ చేసినట్లు ఎస్సైచైతన్యకుమార్ తెలిపారు. ఆయా గ్రామాలలో మద్యం ఓటర్లకు పంచుతున్నారని పక్కా సమాచారం మేరకు ముంబాజీపేటకు చెందిన బీజేపీ కార్యకర్త సంపత్, పొల్కంపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వేధాంత్‌లను పట్టుకుని వారి వద్ద నుంచి నాలుగు కాటన్‌ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకుననట్లు ఎస్సై తెలిపారు. నదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలియతుజేశారు.

క్యాంప్‌కు తరలిన ఎల్లారెడ్డి కౌన్సిలర్లు

ఎల్లారెడ్డి, మే13: ఎల్లారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ కుడుముల సత్యనారాయణ ఏప్రిల్ 24న కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అందుకు నిరసనగా అదే రోజు ఎల్లారెడ్డి నుంచి పది మంది మున్సిపల్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందజేశారు. అయితే బలపరీక్ష నిరూపణ ఈనెల 18న ఉండటంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 9 మంది కౌన్సిలర్లు సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో వారి ఓటు హక్కును వినియోగించుకుని సోమవారం సాయంత్రం క్యాంప్‌కు తరలివెళ్లారు.

25 నుంచి అంచనూర్‌లో రేణుకాదేవి 4వ వార్షికోత్సవం

దోమకొండ, మే 13: మండలంలోని అంచనూర్ గ్రామంలో రేణుకామాత 4వ వార్షికోత్సవం 25 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందులో భాంగంగా అమ్మవారిని సోమవారం జనగామ గ్రామానికి తీసుకెళ్లి పూజలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి విగ్రహంతో 5 గ్రామాలను సందర్శించే సందర్భంలో జనగామలో తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తనవంతుగా ఆలయానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మెట్టు నారాగౌడ్, సిద్దగౌడ్, కృపకర్‌గౌడ్, స్వామిగౌడ్, రాజేందర్‌గౌడ్, బాల్‌రాజగౌడ్ పాల్గొన్నారు.



రేణుకామాత అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న సుభాష్‌రెడ్డి

కామారెడ్డిలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

● ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారుడు ● పలువురి ఓట్ల గల్లంతు



జిల్లా కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



క్యూ లైన్‌లో ఓటర్లు



తమ ఓటును సరిచేసుకుంటున్న ఓటర్లు

కామారెడ్డి టౌన్, మే 13: జిల్లాకేంద్రంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ కొనసాగి సాయంత్రం 6గంటల వరకు సాగింది. 6గంటల తర్వాత పోలింగ్ కేంద్రం లోపల ఉన్నవారిని మాత్రం ఎన్నికల సిబ్బంది అనుమతించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటుహక్కు వినియోగించుకున్న పోలింగ్ కేంద్రంలో కాకుండా దూరప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలలో ఓటు పడడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు పోలింగ్ కేంద్రాలు దొరక్క తికమకపడిన దృశ్యాలు కనిపించాయి. 265, 266 బూత్‌నంబర్‌లలో మాక్‌పోలింగ్ నిర్వహించే సమయంలో ఈవీఎం మొరాయించడంతో అధికారులు అప్పటికప్పుడు మరో ఈవీఎంను తీసుకువచ్చి అమర్చి పోలింగ్ సమయానికి అందుబాటులో ఉంచారు. ఇదిలా ఉంటే జిల్లా కేంద్రంలోని ఒడ్డెర కాలనీలోని పోలింగ్ బూత్‌లో షేక్‌సమద్ అనే వ్యక్తి ఓటు ఉండగా ఆయన గల్ఫ్‌దేశానికి వెళ్లి తిరిగివచ్చాడు. అతను అసలు పోస్టల్ బ్యాలెట్ అప్లయ్ చేసుకోకముందే అతని ఓటు పోస్టల్ బ్యాలెట్ అని ఉందని అధికారులు చెప్పడంతో ఆయన తన ఓటుహక్కు వినియోగించుకోలేక పోయానని వాపోయారు. ఉదయం 9గంటలకు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తన ఓటుహక్కును వినియోగించుకునేందుకు అక్కడికి చేరుకోగా ఆయనకు తన పరిస్థితిని వివరించాడు. అతనితోపాటు మరో వ్యక్తి తన ఓటు డిలిట్ చేశారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓటుహక్కు వినియోగించుకున్నానని 5 నెలల్లోనే తన ఓటును ఏ విధంగా డిలిట్‌చేస్తారని అధికారులు మరి ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఒడ్డెరకాలనీలోనే మధ్యాహ్నం 12గంటలకు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇందుప్రియ బూత్ నంబర్ 227లో తన ఓటుహక్కును వినియోగించు కున్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు మురళిధర్‌గౌడ్ ఆర్అండ్‌బీ కార్యాలయంలో తన ఓటుహక్కును వినియో గించుకున్నారు.కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు బాయ్స్ హైస్కూల్‌లో తన ఓటుహక్కును వినియోగించుకున్నాడు. ఈ సందర్భంగా నాయకులు ఎవరికి వారు వారి పార్టీ అభ్యర్థులు గెలుస్తారంటూ ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జడ్పీ కార్యాల యంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన తల్లిదండ్రులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎస్పీ సింధూశర్మ అశోక్‌నగర్‌లో ని పంచాయతీరాజ్ కార్యాలయంలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.

● ఓటర్ల బీజేపీ వైపే: కామారెడ్డి ఎమ్మెల్యే

గత పదేళ్లుగా నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి పనులతో పాటు దేశాన్ని ప్రపంచదేశాలకు విశ్వగురువుగా తీర్చిదిద్దెందుకు కృషిచేస్తున్నందున బీజేపీ వైపు ఓటర్లు మొగ్గుచూపుతున్నారని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ఒడ్డెర కాలనీలో 215 బూత్‌లో తన ఓటుహక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. లక్ష ఓట్ల మెజార్టీతో జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ గెలుపు ఖాయమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీతోనే ఉన్నారని ముందస్తుగా నరేంద్రమోదీ, బీబీపాటిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో మహిళా ఓటర్లు



వృద్ధుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న దృశ్యం

● 'జహీరాబాద్‌లో సురేష్ షెట్కార్ గెలువబోతున్నారు'

జహీరాబాద్ ఎంపీ స్థానంలో సురేష్ షెట్కార్ గెలువబోతున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నా రు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఒడ్డెర కాలనీలో 214 బూత్‌లో తన ఓటుహక్కు వినియోగించు కున్న అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలోని ప్రజలంతా రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఐదు నెలల కాలంలోని పాలనపై ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ప్రతీ ఓటరు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించే వరకు ఓటు వేయం

● 11 గంటలైనా ప్రారంభం కానీ పోలింగ్

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), మే13: మహ్మద్‌నగర్ మండలంలోని పిప్పిరాగడి తండాలో మౌలిక సదుపాయాలు కల్పించే వరకూ ఓటు వేయబోమని భీష్మించుకుని ఓటర్లు కూర్చున్నారు. దీంతో తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, ఎస్సై సుధాకర్‌లు హుటాహుటీన తండాకు చేరుకున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ 11 గంటలైనా ప్రారంభం కాకపోవడంతో అధికారులు ఆందోళనకు గురయ్యారు. 'ఓట్ల సమయంలోనే మేము నాయకులు, అధికారులకు గుర్తుకు వస్తామా' అంటూ తండా వాసులు ప్రశ్నించారు. తండాలో మౌలిక సదుపాయాలు లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటలు దాటిపోయినా ఏ ఒక్కరూ ఓటు వేయడానికి ముందుకు రాలేదు. దీంతో ఈ విషయాన్ని జుక్కల్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి తెలిపారు. తక్షణమే తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో తండావాసులు శాంతించారు. తండాలో మొత్తం 153 ఓట్లున్నట్లు తహసీల్దార్ భిక్షపతి తెలిపారు.



తండావాసులతో మాట్లాడుతున్న అధికారులు



పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, మే 13: పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా సోమవారం ఉదయం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని లింగారెడ్డిపేట్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పోలింగ్ అధికారులతో మాట్లాడి పోలింగ్ సజావుగా జరిగే విధంగా చూడాలని తెలిపారు. ఆయనతో పాటు మున్సిపల్ ఛైర్మన్ సత్యనారాయణ, టౌన్ ప్రెసిడెంట్ వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని 8లక్షలకు టోకరా

● ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న బాధితుడు

లింగంపేట, మే 13: మండల కేంద్రానికి చెందిన కుమ్మరి ప్రవీణ్ (28) బ్రోకర్ల చేతిలో మోసపోయి చివరకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసు కున్నట్లు ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్‌కు చిట్యాల గ్రామానికి చెందిన ఆరీఫ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి 2019లో మెదక్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నిజామాబాద్‌కు చెందిన రామకృష్ణలు కలిసి మోసం చేసి విడతల వారిగా రూ.8లక్షలు తీసుకుని ఫేక్ అపాయింట్ మెంట్ లెటర్ ఇచ్చి మోసం చేశారు. ఉద్యోగంలో చేరడానికి మెదక్ మున్సిపాలిటీకి వెళ్లగా వారు అది ఫేక్ అని చెప్పడంతో ప్రవీణ్ వారి వద్దకు వెళ్లి తన డబ్బులు తనకు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఇస్తామంటు కాలయాపన చేయడంతో తాను మోసపోయానని గ్రహించి ప్రవీణ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి సత్యనారాయణ బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లగా తల్లి, కొడుకులు కూలీ చేసుకుంటు ఇంటి వద్ద ఉంటున్నారు. ప్రవీణ్‌కు గత సంవత్సరం క్రితం వివాహం జరిగింది భార్యభర్తలు ఇద్దరు విడాకులు తీసుకుని విడిపోయారు. వారికి ఒకే కొడుకుకావడంతో బోరున విలపిస్తున్నారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

● పలువురిపై కేసు నమోదు

లింగంపేట, మే 13: మండలంలోని శెట్పల్లి చౌరాస్తా సమీపంలోని కరీంనగర్ డెయిరీ వద్ద ఆదివారం అర్ధరాత్రి బీజేపీ-కాంగ్రెస్ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలు కాగా పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీజేపీకి చెందిన రామకృష్ణగుప్త మరో ఇద్దరు కారులో లింగంపేట నుంచి పర్మల్లకు కారులో రాత్రి వెళ్లారు. పర్మల్ల గ్రామ శివారులో కాంగ్రెస్ కార్యకర్తలు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారు తిరిగి లింగంపేటకు వైపు వచ్చారు. పర్మలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు లింగంపేట కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే లింగంపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శెట్పల్లి చౌరాస్తా సమీపంలో వారి కారును అడుకున్నారు. దాంతో ఇరు వార్గల మధ్య ఘర్షన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువార్గలపై లాఠిచార్జీ చేసి చెదరగొట్టారు. ఈ ఘర్షనలో బీజేపీకి చెందిన రామకృష్ణగుప్తకు.కాంగ్రెస్‌కు చెందిన నారాగౌడ్‌కు గాయాలు కావడంతో వారిన ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణ కారు ధ్వంసమనట్లు పోలీసులు తెలిపారు. పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముత్యంపేటలో పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదం

● మొరయించిన ఈవీఎంలు

దోమకొండ, మే13: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూ కట్టారు. చింతమాన్‌పల్లి గ్రామంలో ఉదయం 30 నిమిషాల పాటు ఈవీఎం మొరయించడంతో అధికారులు అప్రమత్తమై సరిచేశారు. ముత్యంపేటలో పోలింగ్ కేంద్రం బయట రోడ్డుపై వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఉండటంతో, అక్కడకు ఎస్సై గణేష్ తన సిబ్బందితో చేరుకుని లాఠితో కొట్టారని దీంతో నాయకులకు పోలీసులకు మధ్య వాగ్వదం చోటుచేసుకుంది. తమకు వెళ్లిపోవాలని చెప్పకుండనే జీపు దిగి వచ్చి లాఠితో కొట్టడం సమాంజసం కాదని ముత్యంపేటకు చెందిన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎస్సైతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మాట్లాడుతూ ఎవరిని కొట్టలేదని ఎన్నికల నిబంధనల ప్రకారమే 144 సెక్షన్ అమల్లో ఉన్నందున వారిని అక్కడి నుంచి చెదరగొట్టెందుకు ప్రయత్నించే సమయంలో ఒకరికి లాఠి తగిలి ఉండవచ్చని ఎస్సై అన్నారు. ఎలక్షన్ కమీషన్ నిబంధనల మేరకు తాము విధులు నిర్వహించడం జరిగిందన్నారు. ఎవరిని లాఠితో కొట్టలేదని,ఎక్కడ కూడా లాఠిచార్జ్ చేయలేదన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగానే జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సురేష్ షెట్కార్

పెద్ద కొడప్‌గల్, మే 13: పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో గల పోలింగ్ కేంద్రాన్ని జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని ఎలా సాగుతుందనే విషయం అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నాగిరెడ్డిపేటలో 78 శాతం పోలింగ్

నాగిరెడ్డిపేట, మే 13: మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 78 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉదయం 7 గంటల నుంచి బారులు తీరారు. ఆదివారం మండలంలోని భారీగా అకాల వర్షం కురవడంతో, సోమవారం వాతావరణం చల్లబడటంతో ఓటర్లు ఉదయం నుంచే ఉత్సాహంగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని చీనూర్ పోలింగ్ కేంద్రాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పరిశీలించారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ పోలింగ్ కేంద్రాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు.



ఎస్సై గణేష్, నాయకుల మధ్య వాగ్వదం జరుగుతున్న దృశ్యం

ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్

బిచ్కుంద,మే 13: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఖత్‌గావ్ గ్రామంలో 1400 మంది ఓటర్లు ఉండగా కేవలం ఒకే పోలింగ్ బూత్ ఏర్పాటుచేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో ఖత్‌గావ్ గ్రామంలో ఒకే పోలింగ్ బూత్ కారణంగా ఓటుహక్కు వినియోగించుకోవడానికి రాత్రి 10గంటల సమయం పట్టిందని ఇలాంటి పరిస్థితి ముందుముందు ఎన్నికల్లో ఇబ్బందులు ఎదురుకావద్దని రెండుపోలింగ్ బూత్‌లను ఏర్పాటచేయాలని అధికారులు విన్నవించిన పట్టించుకోలేదని వాపోయారు .అదేవిధంగా మండల కేంద్రంలోని 122 పోలింగ్ బూత్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార తన ఓటుహక్కును వినియోగించుకోగా సద్గురు బండయ్యప్ప స్వామి మఠాధిపతి సోమలింగాశివాచార్యులు తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.

మాచారెడ్డిలో ప్రశాంతంగా పోలింగ్

మాచారెడ్డి, మే 13: ఉమ్మడి మాచారెడ్డి,పాల్వంచమండలాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉదయం 7 గంటల వరకే పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడలో ప్రశాంతంగా పోలింగ్

● పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే పోచారం

● ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు

బాన్సువాడ/బాన్సువాడటౌన్, మే 13: బాన్సువాడ నియోజకవర్గంలో సోమవారం పార్లమెంట్ 4వ విడత ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 258 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 26 సెక్టార్లలో 48 సమస్యాత్మక ప్రాంతాలలో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు. పట్టణంలోని 240 పోలింగ్ బూత్ వీవీప్యాడ్ సమస్యతో పోలింగ్ 10 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. అదేవిధంగా 224 పోలింగ్ బూత్‌లో పోలింగ్ 4 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల సరళిని ఎన్నికల అధికారులు ఎప్పటికపుడు పర్యవేక్షించారు. బాన్సువాడ మండలంలోని పోచారం గ్రామంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన సతీమణి పుష్పమ్మతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని తాడ్కోల్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ కాంగ్రెస్ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ డీసీసీబీ ఛైర్మెన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి పోచారం భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పోచారం గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డిలు పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ సరళిని పరిశీలించారు. వేసవికాలం కావడంతో ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కాగా బాన్సువాడ సెగ్మెంట్‌లో సాయంత్రం 5 గంటల వరకు 73.99 శాతం పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేశ్‌రాథోడ్ తెలిపారు.



ఓటరు రెండు చేతులకూ సిరా చుక్కలు

బాన్సువాడ/బాన్సువాడటౌన్, మే 13: పోలింగ్ కేంద్రాలలో ఓటు వేసే ముందు ఎన్నికల అధికారులు చేతికి సిరా చుక్కలు వేస్తారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో 223 పోలింగ్ బూత్‌లో బాలకిషన్ అనే ఓటరుకు ఎన్నికల సిబ్బంది రెండు చేతులకూ సిరా చుక్కలు వేశారు. దీంతో అక్కడున్న వారంతా రెండు చేతులకు సిరాచుక్కలు ఏంటని అవాక్కయ్యారు. అధికారులు కర్తవ్య నిర్వహణ లోపం వల్లే ఇలా జరిగి ఉండవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్	- కింగ్‌డమ్ ఆఫ్‌ది ఆప్స్
శాంతి	- టిల్లు స్క్వేర్
ప్రియా 70	- క్రిష్ణమ్మ
ప్రియా 35	- ప్రతినిధి-2

బాన్సువాడ

మహేశ్వరి	- బాక్
వెంకటేశ్వర	- కృష్ణమ్మ



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

